




# కరపత్రం

SINCE 2014

మంగళవారం మే 05, 2026 | సంపుటి : 2 | సంచిక : 204 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

## భారత రాజ్యాంగాన్ని బలపరచిన ఎన్నికలు

- భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన ఎన్నికలు
- బెంగాల్ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి
- గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం
- అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం
- తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా
- బిజెపి కార్యాలయంలో జరిగిన విజయోత్సవంలో మోడీ

**న్యూఢిల్లీ,మే4 :**
ఇవాళ భాజపా చరిత్ర సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని అన్నారు. ఇది ప్రజలకు నిజమైన భరోసా ఇచ్చిన రోజు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు. అని ప్రధాని అన్నారు. నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ దిల్లీలోని భాజపా కార్యాలయానికి సంప్రదాయ పంచెకట్టుతో వచ్చారు. పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. పార్టీ కార్యకర్తల సంబరాల్లో నేనూ పాల్గొంటున్నా.

మిగతాద్ది 2 లో

# జవహర్ డంపింగ్ యార్డును తొలగించండి

## సిఎంను కోరిన ప్రజాప్రతినిధులు



**హైదరాబాద్,మే4 :**
జవహర్ నగర్ డంప్ యార్డును తరలించాలాలని సీఎం రేవంత్‌ను పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసారు. ఇక్కడి చెత్తను తొలగించి చుట్టుపక్కల ప్రజలకు విముక్తి కలిగించాల న్నారు. డంప్ యార్డును తొలగిస్తామన్న వాగ్దానాన్ని వారు గుర్తు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యాంటీ జవహర్ నగర్ డంప్ యార్డ్ జెఎసి కలిసింది. సీఎంను కలిసిన వారిలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జెఎసి కన్వీనర్ శంకర్ నారాయణ్, ఇతర జెఎసి నాయకులు అన్నారు. సమస్య తీవ్రత తెలుసని, పరిష్కారం ఆలోచిస్తున్నామని సిఎం అన్నారు.

# తమిళనాట మరోమారు సినీ ప్రభంజనం

- మామూలు నటుడి విశ్వరూప ప్రదర్శనం
- ఎంజిఆర్, జయలలిత తరవాత అంతటి విజయం
- సామాన్యుడిగా వచ్చి అసామాన్యుడి ఎదిగిన విజయ్



**చెన్నై,మే4 :**
తమిళనాట మామూలు నటుడిగా కనిపించిన వ్యక్తి.. నేడు కోట్ల మంది గొంతుకగా మారి రాజకీయ రంగంలో పెను సంచలనం సృష్టించాడు. అభిమానుల గుండెల్లో 'దళపతి'గా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్.. ఇప్పుడు 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) జన నాయకుడిగా తన కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్‌లో రాజకీయ నాయకుడిగా ఎంట్రీలోనే ప్రభంజనం సృష్టించారు విజయ్. గతంలో ఎంజిఆర్, జయలిత తరవాత ఇప్పుడు విజయ్ ఆ దిశగా ప్రయాణం మొదలయ్యిందనే చెప్పాలి. రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్ అనుకుని వెనకడుగు వేశారు. కమలహాసన్‌కు కలిసి రాలేదు. 1974 జూన్ 24న విజయ్ జన్మించారు. తల్లి శోభ గాయని, తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకుడు. తొలినాళ్లలో కనీసం బాత్రూమ్ కూడా లేని చిన్న గదిలో విజయ్ తల్లిదండ్రులు నివాసం ఉండేవారు. అతడికి ఏడేళ్లు వచ్చేవరకు ఆర్థికంగా సతమతమవుతూనే ఉండేది ఆ కుటుంబం. ఆ తర్వాతే విజయ్ తల్లిదండ్రులు విజయ్‌కాంత్‌తో 'చట్టం ఒరు ఇరుట్టరై' తీశారు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది. దీంతో వీరు ఆర్థికంగా స్థిరపడ్డారు. విజయ్ చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ ఆట పట్టించేవాడు. కానీ, ఆయన సోదరి మరణం విజయ్ జీవితాన్ని మార్చేసింది. తన చెల్లి విద్య అంటే విజయ్‌కు ప్రాణం. ఆమె చనిపోయిన తర్వాత విజయ్ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయారు. నేటికీ ఆయన తెరపై అంత ఎనర్జీతో కనిపిస్తున్నా.. బయట మాత్రం చాలా మితభాషిగా ఉండటానికి ఆనాటి విషాదమే కారణమని విజయ్ తండ్రి చంద్రశేఖర్ చెబుతుంటారు.

మిగతాద్ది 2 లో



## బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు

- తెలంగాణలోనూ బిజెపి గెలుపు తథ్యం
- అత్యతంత ప్రతిష్టాత్మకంగా 10న ప్రధాని సభ
- ఎంపి ధర్మపురి అర్వింద్ వెల్లడి

2లో..

**హనుమకొండ,మే4**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హనుమకొండలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు.

## కేరళలో రేవంత్ ప్రచారం పనిచేసింది

- వ్యూహాత్మకంగా ప్రచార సరళి
- కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్ గౌడ్ తదితరుల ప్రశంసలు



**హైదరాబాద్,మే4 :**
కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. కేరళలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, నాయకులు ప్రచారం నిర్వహించడం.. తెలంగాణ పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపించింద న్నారు. కేరళలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని.. మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందని వెల్లడించారు.

2లో..

## ప్రస్తుత రాజకీయాలపై జనం విసిగిపోయారు

- తమిళనాడు ఫలితమే ఇందుకు నిదర్శనం
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత పోస్ట్



**హైదరాబాద్,మే4 :**
ప్రస్తుతం ఉన్న రాజకీయ వ్యవస్థలు, నాయకుల అధికార దాహంతో ప్రజలు విసిగిపోయారని, భ్రష్టుపట్టిన ఈ చరిత్రను మార్చడానికి కొత్త రాజకీయ శక్తులు ఉద్భవించాల్సిన సమయం ఆసన్నమైందని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాదని, అది దేశం మొత్తానికి ఒక బలమైన సంకేతమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం.. తెలంగాణలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులేనని విశ్లేషకులు భావిస్తున్నారు.



## దళపతి విజయ్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి,మే4 :**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత, దళపతి విజయ్ గెలుపొందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. దళపతి విజయం సాధించడంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తమిళ ప్రజలకు సేవ చేసే దిశగా విజయ్ కృషి చేయాలని ఆకాంక్షించారు.

2 లో



## రెండు బిల్లుల వ్యతిరేకతే వారికి శాపం: బండి సంజయ్

**కరీంనగర్:**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఫలితాల వెలువడుతున్నాయి. ఐదింట మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం అందుకోనుంది. తమిళనాడులో ఫలితాలు హంగ్ దిశగా, కేరళలో యూడీఎఫ్ విజయం దిశగా వెళ్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం



- సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు
- బ్రేక్‌డౌన్ అయినప్పుడు 14449కు ఫోన్ చేయండి
- వాహనదారులకు కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్,మే4 :**
హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ఇటీవల కాలంలో ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పలు సూచనలు చేశారు.

2లో..

## అకాల వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తం

- ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు ఆదేశాలు
- అధికారులతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్



02

**హైదరాబాద్,మే4 :**
అకాల వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,575 కొనుగోలు

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం మే 05, 2026

# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

బెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగింది. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయి. గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకూ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి. బ్రహ్మపుత్ర ఆశీర్వాదం వల్ల అస్సాంలోనూ హ్యాట్రిక్ సాధించాం. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను మేం నెరవేర్చాం. బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుంది. ఇక నుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని ప్రకటించారు. సుపరిపాలన అందించినందుకే ప్రజలు మాకు పట్టం కట్టారు. తమ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే భాజపా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా అంటేనే అభివృద్ధి.. సంక్షేమం అని మోదీ పేర్కొన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించిందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. బెంగాల్‌లో మార్పుకోరుతూ పవనాలు బలంగా వీచాయని పేర్కొన్నారు. బీజేపీ అంటేనే సుపరిపాలన అనే విషయం ప్రజలకు బాగా తెలుసునని ప్రశంసించారు. స్సాంలో బీజేపీ-ఎన్డీయేను ప్రజలు మరోసారి ఆశీర్వదించారని, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని ప్రధాని కొనియాడారు. తిరుగులేని తీర్పునిచ్చిన అస్సాం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వోతో ముఖాభివృద్ధికి భరోసాగా ఉంటామన్నారు. దశాబ్దాలుగా పార్టీ, కూటమి ఎదుగుదలకు అవిశ్రాంతంగా కృషి చేసిన బీజేపీ-ఎన్డీయే కార్యకర్తలను అభినందించారు. ముఖ్యమంత్రి ఎన్.రామస్వామి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం టాక్ రికార్డు, సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టిన పుదుచ్చేరి ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలకు అభినందనలు చెప్పారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్‌కు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. బీజేపీ-ఎన్డీయేకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కేరళ ప్రగతి కోసం, వికసిత కేరళం విజన్ సాకారం కోసం తాము పనిచేస్తామని చెప్పారు. కేరళం ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. తమిళనాడులో మంచి ఫలితాలు సాధించిన విజయ్ టీవీకేను ప్రధాని అభినందించారు. ఎన్డీయేకు మద్దతుగా ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలు, వారి జీవనప్రమాణాల మెరుగుదలకు తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. తమిళనాడు ప్రగతి, ప్రజాక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జెపి నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాట మరోమారు సినీ ప్రభజంనం

మొదటి పేజీ తరువాయి

చిన్నప్పటి నుంచి తండ్రిని చూసిన విజయ్ దృష్టి సినిమాల వైపు మళ్లింది. కానీ, 'మీవాడు హీరో ఏంటండీ, అసలు నటుడిగానే పనికిరాడు... బండమొహం వాడిది!' అంటూ ఎవరూ అవకాశాలు ఇవ్వలేదు. దీంతో రూ.60లక్షలు అప్పు చేసి విజయ్ తండ్రే దర్శకుడిగా ఆయనతో సినిమా తీశారు. అలా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్‌కు తొలి ప్రయత్నంలో నిరాశే ఎదురైంది. తొలి సినిమా 'నాళయ తీర్పు' ఫ్లాప్. రెండు నెలలు కనీసం ఫ్రెండ్స్‌ను కలవడానికి కూడా విజయ్ బయటకు వెళ్లలేదు. చివరకు ఆ స్నేహితులే విజయ్‌కు అండగా నిలబడ్డారు. ఆయనలో ధైర్యం నింపారు.తనను తాను నిరూపించుకోవాలనుకున్న విజయ్.. డ్యాన్స్ పైన కసరత్తు మొదలుపెట్టాడు. కరాటే నేర్చుకున్నాడు. పగలూ, రాత్రీ ఇంకే ధ్యాసా లేకుండా సాధన చేశాడు. ఆ తర్వాత సరికొత్త విజయ్‌గా 'రసిగన్' అనే సినిమా చేశాడు. 1994లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఒకప్పుడు విమర్శించినవాళ్లే.. శెభాష్ అంటూ మెచ్చుకున్నారు. 1990 చివర్లో, 2000 ప్రారంభంలో విజయ్ సినీరంగాన్ని శాసించారు. 'ఖుషి', 'గిల్లి' వంటి సినిమాలతో సూపర్ హిట్‌లు అందుకున్నారు. అప్పుడే అందరూ విజయ్‌ను 'ఇళయ దళపతి' అని పిలవడం ప్రారంభించారు. అనతికాలంలోనే ఆ పేరు దళపతిగా మారింది. విజయ్ నటించిన 'అదిరింది', 'సర్కార్', 'విజిల్', 'మాస్టర్' వంటి సినిమాలు ఆయన్ని ప్రేక్షకులకు మరింతగా చేరువ చేశాయి. ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్న విజయ్.. వారికి సేవ చేయాలని రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. 2024 ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కజగం' స్థాపించారు. ఈ పార్టీ ప్రారంభించాక 'లియో' ఆడియో రిలీజ్‌లో విజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయనకు అభిమానులంటే ఎంత ప్రేమో తెలియజేశాయి. 'నాపై ఇంత అభిమానం చూపుతున్న మీకు ఏదైనా తప్పకుండా చేయాలనుంది. చేస్తా. మీ కాలికి చెప్పులా ఉండటానికి కూడా వెనకాడను. ఇప్పుడేం జరిగినా పట్టించుకోకుండా అందరూ ఓపికగా ఉండండి. విజయాన్ని అందుకోవచ్చు' అన్నారు. నాడు చెప్పినట్లు గానే నేడు విజయాన్ని అందుకున్నారు.

# రెండు బిల్లుల వ్యతిరేకతే వారికి శాపం: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

మహిళా బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించిన పార్టీలకు గుణపాఠం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.కేంద్రమంత్రి బండి సంజయ్ తాజాగా కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ..'పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అసోంలో బీజేపీ గెలుస్తోంది. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ ఇక అధికారంలోకి రాదు. రాహుల్ గాంధీని రాజకీయ నాయకులుగా ఆ పార్టీ నాయకులే గుర్తించడం లేదు. దేశ ప్రజలంతా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలవాలని కోరుకున్నారు. కేరళ, తమిళనాడులో ఆశించిన ఫలితాలే వస్తున్నాయి. ఈ ఫలితాలు కాంగ్రెస్‌తో పాటు, అనేక పార్టీలకు గుణపాఠం అని ఘాటు విమర్శలు చేశారు.మరోవైపు.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..'అసోంలో వచ్చిన తీర్పు బీజేపీ పాలనకు సజీవ సాక్ష్యం. బెంగాల్ ప్రజలకు శుభాకాంక్షలు. తెలంగాణ ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తెలంగాణ ప్రజలకు సందేశం ఇవ్వడానికి మోదీ రాబోతున్నారు. హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్లలో తప్పకుండా బీజేపీ విజయం సాధిస్తుంది. సౌత్‌లో భవిష్యత్‌లో ఎగిరేది బీజేపీ జెండానే. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారు' అని వ్యాఖ్యలు చేశారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

**అసోం, పుదుచ్చేరిల్లో అధికారం నిలబెట్టుకున్న బిజెపి**
**బెంగాల్లో పాగా వేసిన బిజెపి..మట్టి కరిచిన మమతా బెనర్జీ**
**కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం**
**తమిళనాట విజయ్ కొత్త కెరటం**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదుచ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం సాదించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసుకుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలో కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది. కేరళలో యూడీఎఫ్ కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే 104 చోట్ల ఆధిక్యంలో ఉంది. డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 293 స్థానాలకు గానూ.. భాజపా దాదాపు 205 చోట్ల ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 85 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. కేరళలో 140 స్థానాలుండగా.. యూడీఎఫ్ 100 సీట్లను గెల్చుకుంది.. ఎల్‌డీఎఫ్ 32 స్థానాల్లో, ఎన్డీయే 3చోట్ల గెలుపొందింది. అస్సాంలో 126 స్థానాలుండగా.. భాజపా 100కు పైగా సీట్లతో హ్యాట్రిక విజయాన్ని నమోదు చేసింది. స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 26 చోట్ల ముందంజలో ఉంది. పుదుచ్చేరీలో 30 స్థానాలకు గానూ ఎన్నార్ కాంగ్రెస్9 చోట్ల గెలిచి 11 చోట్ల ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2 చోట్ల గెలిచి.. 5 స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తంగా బిజెపి తనకున్న రెండు రాష్ట్రాలకు తోడు బెంగాల్లో పాగా వేసింది.

## భవానీపూర్‌లో మమతా బెనర్జీ ఓటమి

# సువేందు అధికారి చేతిలో 15వేలతో పరాజయం

**ఎన్నికల ఫలితాలపై ..మమత లూటీ కామెంట్స్**

పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీకి గట్టి షాక్ తగిలింది. ఆమె పోటీ చేసిన భవానీపూర్ స్థానం నుంచి ఓటమిపాలయ్యారు. ఇక్కడ భాజపా అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేలకుపైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక బెంగాల్‌లో భాజపా 200కుపైగా సీట్లతో ఘన విజయాన్ని సొంతం చేసుకోగా.. తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటి వరకూ కేవలం 72 స్థానాల్లోనే విజయం సాధించింది. మరో 7 స్థానాల్లో ముందంజలో ఉంది. 2021లోనూ మమతా బెనర్జీని సువేందు అధికారి ఓడించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మమతా బెనర్జీ పార్టీ తృణముల్ కాంగ్రెస్ వర్గాల్నిదిగ్భ్రాంతికి గురిచేశాయి. నాలుగోసారి అధికారం దక్కించుకోవాలని ఆశించిన మమతా బెనర్జీకి ఈ ఫలితాలు పెద్ద షాకే ఇచ్చాయి. ఈ ఓటమిపై స్పందించిన ఆమె, ఇది ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చిన గెలుపు కాదని, పూర్తిగా 'లూటీ' అని ఆమె ఆరోపించారు. ఫలితాల సరళిని బట్టి మమతా బెనర్జీ కేంద్ర ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఇప్పుడు బీజేపీ కమిషన్‌గా మారిందని ఆమె ఆరోపించారు. బీజేపీ సుమారు 100కు పైగా స్థానాలను లూటీ చేసిందని, దీనిపై తాము చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనైతిక విజయమని, సెంట్రల్ ఫోర్సెస్, కేంద్ర మంత్రుల అండతో చేసిన అక్రమమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, తృణమూల్ కాంగ్రెస్ మళ్లీ బలంగా పుంజుకుంటుందని మమతా బెనర్జీ ఆశాభావం వ్యక్తం చేశారు. అక్రమాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. కాగా, బెంగాల్ గడ్డపై బీజేపీ అసాధారణ విజయాన్ని నమోదు చేసింది. తాజా లెక్కల ప్రకారం బీజేపీ 142 స్థానాల్లో విజయం సాధించి, మరో 66 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, గతేడాది బీహార్ ఫలితాల సమయంలోనే తాను చెప్పినట్లుగా 'గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందని' వ్యాఖ్యానించారు.

# కేరళలో చారిత్రాత్మక విజయం

**– తమిళనాడు విజయంపై విజయ్‌కు రాహుల్ అభినందనలు**

కేరళ ఓటర్లు నిర్ణయాత్మక తీర్పు అందించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాను ఇంతకుముందు చెప్పినట్లుగా.. కేరళలో ప్రతిభ, సామర్థ్యాలు ఉన్నాయని.. ఇప్పుడు, ఆ రెండింటినీ సద్వినియోగం చేసుకునే యూడీఎఫ్ ప్రభుత్వం ఏర్పడనుందని తెలిపారు. త్వరలోనే కేరళకు వెళ్తానని 'ఎక్స్' వేదికగా చెప్పారు. తమిళనాడు ఫలితాల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో.. విజయ్‌కు రాహుల్ గాంధీ ఫోన్ చేసి అభినందించారు. 'టీవీకే అద్భుతమైన ఫలితం సాధించింది. పెరుగుతోన్న యువస్వరం ప్రాధాన్యాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తోంది. ఇక్కడి ప్రజల ప్రయోజనాలు కాపాడే విషయంలో ఎప్పుడూ ముందుంటాం' అని తెలిపారు. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సత్తా చాటింది. 140 స్థానాలకుగానూ 102 కైవసం చేసుకుంది. దీంతో పదేళ్ల తర్వాత రాష్ట్రంలో మరోసారి అధికారం చేపట్టనుంది. మరోవైపు, తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే ఇప్పటివరకు 100కుపైగా స్థానాల్లో విజయం సాధించింది. పూర్తి ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది.

# ముస్లింలకు రేవంత్ శుభవార్త

తెలంగాణ ప్రభుత్వం హజ్ యాత్రికులకు గుడ్ న్యూస్ తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో హజ్ యాత్ర ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని పేద ముస్లిం సోదరులపై పడకుండా, ఆ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హజ్ యాత్రికులకు అదనంగా అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 7 వేల మంది హజ్ యాత్రికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ముస్లిం యాత్రికులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. ముస్లిం సోదరులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని హజ్ యాత్రికులు, మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి విజయంపై విజయవాడలో సంబరాలు

**– ఇది చారిత్రాత్మక విజయమన్న కేంద్రమంత్రి వర్మ**

పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ ఆధిక్యం కనబర్చడంపై విజయవాడలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్వీట్లు తినిపించి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకోగా.. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం చరిత్రాత్మకమన్నారు. అక్కడ కమ్యూనిస్టుల పాలనలో బీజేపీ నేతలపై దాడులు జరిగాయని విమర్శించారు. 2011లో ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా.. 2021లో 70 స్థానాల్లో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు దాదాపు రెండు వందల స్థానాల్లో బీజేపీ విజయం దిశగా దూసుకెళ్తోందన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ.. అరాచకాలు, విధ్వంసకర ధోరణికి పాల్పడ్డారని, దేశ హితానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్లే మమత గెలుస్తూ వచ్చారని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేవలం సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి, రాష్ట్ర ప్రయోజనాల కన్నా తన స్వార్థం చూసుకున్నారని మమతా బెనర్జీపై కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలింగ్ రోజు కూడా అనేక దాడులు చేయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిని అధిగమించి అక్కడి ప్రజలు మమత కుట్రలను తిప్పి కొట్టారన్నారు. బీజేపీపై నమ్మకంతో దాదాపు 200 స్థానాల్లో విజయం కట్టబెట్టారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో చొరబాట్లను మమతా ప్రోత్సహించడం వల్లే గెలిచారంటూ తాము చెప్పిన మాటలే ఇప్పుడు నిజమని తేలాయన్నారు.

### బెంగాల్ గెలుపుతో

# విపక్షాల్లో వణుకు

మొదటి పేజీ తరువాయి

లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనుందన్నారు. తెలంగాణలో కూడా ఎస్‌ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. 'వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కొందరికి పార్టీలు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారిందని, కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉండన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీఐకి అప్పగించారు. సీబీఐ తన పని తాను చేసుకుపోతుంది. తెలంగాణలో ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ఏం మాట్లాడతాం. సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ అంటున్నారు.. వాస్తవానికి ఆ బియ్యం ఇస్తుంది నరేంద్ర మోదీనే. కేసీఆర్ పెట్టిన పంగనామాలను రేవంత్ రెడ్డి కంటిన్యూ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు.

## కేరళలో రేవంత్ ప్రచారం పనిచేసింది

మొదటి పేజీ తరువాయి

తమిళనాడులో మెజారిటీ స్థానాలు గెలుచుకున్న టీవీకే అధినేత విజయ్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలపై ఇండియా కూటమి సమీక్ష చేసి.. మరింత బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ విజయం సాధించింది. ఈ విజయం వెనక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. యూడీఎఫ్ విజయంలో సీఎం రేవంత్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేరళ సీఎం విజయన్‌పై.. రేవంత్ రెడ్డి నేరుగా విమర్శలు ఎక్కుపెట్టారని గుర్తు చేశారు. కేరళ అభివృద్ధిపై విజయన్‌ను నిలదీయడం తోపాటు లేఖలు కూడా రాశారని పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేరళ ప్రచారంలో రేవంత్‌రెడ్డి వివరించారన్నారు. ఒక్క డైలాగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల దశను మార్చారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కొనియాడారు. ఆయన బ్రాండ్ కేరళలో ఉపయోగపడిందన్నారు. విజయన్ టైం అయిపోయిందని రేవంత్ ముందే చెప్పారని గుర్తు చేశారు. కేరళ ఎన్నికల్లో ఆయన ప్రసంగాలు పార్టీ అభ్యర్థుల విజయాలకు దోహదపడ్డాయన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆ రాష్ట్ర ప్రజలను తన ప్రసంగాలతో ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేరళ ప్రజలకు వివరించారన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.

# ప్రస్తుత రాజకీయాలపై జనం విసిగిపోయారు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనతో ప్రజలు విసిగిపోయారని భావిస్తున్న కవిత, తన కొత్త పార్టీని ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ప్రజల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులో సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా వచ్చిన మార్పును ఉదహరిస్తూ, తెలంగాణలో కూడా అటువంటి మార్పు అనివార్యమని కవిత పరోక్షంగా హెచ్చరించారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని.. అందుకే ప్రజలు ఇప్పుడు కొత్త గొంతుక కోసం ఎదురుచూస్తున్నారని ఆమె ఈ పోస్ట్ ద్వారా చెప్పుకొచ్చారు. పాత రాజకీయ శక్తుల వల్ల వ్యవస్థ దెబ్బతిందని, దానిని ప్రక్షాళన చేయాలంటే సరికొత్త సిద్ధాంతాలతో కూడిన నాయకత్వం రావాలని ఆమె బలంగా విశ్వసిస్తున్నారు. తన పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' కొత్తది కావడం వల్ల, ప్రజలు తమకు ఒక్క అవకాశం ఇస్తారనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారుతుందని, పాత శక్తులకు కాలం చెల్లి కొత్త శక్తులు అధికారంలోకి వస్తాయని ఆమె ధీమాగా ఉన్నారు. మార్పు అనేది సమాజానికి సహజమని, తమిళ ప్రజల చైతన్యం తెలంగాణలో కూడా కనిపిస్తుందని ఆమె విశ్లేషించారు. కవిత మాటలు అధికార పక్షాలకు సవాలు విసిరేలా ఉండటమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఆమె తన పార్టీ పాత్రను ఎంత కీలకంగా భావిస్తున్నారో స్పష్టం చేస్తున్నాయి.తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసిన వేళ, తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కవిత చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది.

## దళపతి విజయ్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి

అలాగే ఆ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చంద్రబాబు కోరారు. 'తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయ్‌కు లభించిన అద్భుత విజయం పట్ల వారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను. తమిళనాడు ప్రజలకు సేవ చేసేందుకు చేపట్టే ప్రతి పనిలో విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఆ రాష్ట్ర ప్రజల పురోగతి, శ్రేయస్సుకు అర్థవంతంగా తోడ్పడేందుకు విజయ్ చేస్తున్న కృషికి సంపూర్ణ విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు.

# ఓఆర్‌ఆర్‌ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు సజ్జనార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాహనాల బ్రేక్ డౌన్, మెడికల్ ఎమర్జెన్సీ వంటి బలమైన కారణాలు ఉంటే తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి తీసుకోవడానికి వాహనాలను రోడ్డు పక్కన నిలపడం చట్టరీత్యా నేరమని.. అత్యంత ప్రమాదకరమని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఒకవేళ మీ వాహనం ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వీరు మీకు తగిన సహాయం అందించడమే కాకుండా, ఇతర వాహనదారులను అప్రమత్తం చేసే ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో వాహనాన్ని నిలపాల్సి వస్తే, వేగంగా వచ్చే ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఎడమ వైపు ఉన్న లైన్‌లో మాత్రమే నిలపాలని సీపీ సజ్జనార్ సూచించారు. వాహనం ఆపినప్పుడు, వెనుక నుంచి వచ్చే వారికి కనీసం 50 నుంచి 100 మీటర్ల దూరం నుంచే తెలిసేలా 'రిఫ్లెక్టివ్ ట్రయాంగిల్స్' లేదా ఇతర హెచ్చరిక గుర్తులను ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనం ఆపి ఉన్నంత సేపు హజార్డ్ లైట్లను (నాలుగు ఇండికేటర్లు) ఆన్ చేసి ఉంచడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు. క్షఖీఖీపై వాహనాల వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్ల వరకు పెంచిన నేపథ్యంలో, ఒక్క చిన్న పొరపాటు కూడా భారీ ప్రాణ నష్టానికి దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నిబంధనలను పాటించి మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# లంచగొండి ఉద్యోగి పట్టివేత

బోరబండ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. జూనియర్ అసిస్టెంట్ శ్రీలత రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎస్పీ మాజిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగాయి.

# Left is left ... Right is right

# 2026 ఎన్నికలతో కమ్యూనిస్ట్ ముక్త్ భారత్ జరిగిందా!

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

- బిజెపి ఒక లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ముక్త్ భారత్ కంటే ముందు కమ్యూనిస్ట్ ముక్త్ భారత్ జరిగిందా అని లోకం ఆశ్చర్యపోయింది

## "ఎర్రకోటలు కూలాయి.. చరిత్ర మలుపు తిరిగింది

2026 ఎన్నికల తీర్పుతో భారత రాజకీయాల్లో కమ్యూనిస్టు శకం ముగిసింది. అజేయమైన కోటగా భావించిన కేరళలోనూ ఓటమితో, ఐదు దశాబ్దాల తర్వాత దేశం 'కమ్యూనిస్టు ముక్త్ భారత్'గా అవతరించింది.
భావ జాలాల పోరులో కొత్త చరిత్రకు నాంది జరిగింది. ఇది ప్రజాస్వామ్య భారత దేశంలో సరికొత్త ప్రస్థానం!"

ముగిసిన శకం

- గత 50 ఏళ్లలో మొదటిసారిగా దేశంలో కమ్యూనిస్టు ముఖ్యమంత్రి ఎవరూ లేరు

జాతి ప్రయోజనాలను,ప్రజా పోరాటాలను మరచిన కమ్యూనిస్టులు తోక పార్టీలుగా మారి పోయి తమ ఉనికిని కోల్పోయాయి.

- 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ట్రెండ్స్‌ను బట్టి భారతదేశంలో కమ్యూనిస్ట్ ప్రభుత్వాల శకం ముగిసినట్లు కనిపిస్తోంది

నినాదాలకే పరిమితమైన కమ్యూనిస్టుల భావజాలం భారత ప్రజలకు వెగటు పుట్టించింది. మతోన్మాద వ్యతిరేక పోరాటం అంటూ ఒక పసలేని ప్రణాళికను ఆచరించిన కమ్యూనిస్టులు ఆర్ఎస్ఎస్, బిజెపి వ్యతిరేకతతో అంధ విరోధులుగా మారిపోయారు.అంధ విరోధులుగా మారిపోయినా పర్వాలేదు తమ లక్ష్యాన్ని మరిచిపోయారు కమ్యూనిస్టులు.కమ్యూనిస్టులు ఎంతగా రాజకీయ శూన్యత లోనికి ప్రవేశించారో తెలుసుకోవాలంటే, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వారి కార్యాచరణ చూసినప్పుడు అందరికీ స్పష్టంగా అర్థం అవుతుంది.
ఒకే ఒక్క సీటు కొరకు.. కాంగ్రెస్ తో పొత్తు కొరకు దేబిరించిన CPI తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కూనమనేని సాంబశివ రావు చేసిన కామెంట్లు కమ్యూనిస్టుల రాజకీయ శూన్యత ను,ఆ స్టేట్ మెంట్లు వారి కార్యాచరణ శూన్యతను తెలుపుతుంది.

- "తెలంగాణలో బిజెపి ని అధికారంలోకి రానివ్వం" అంటూ కూనమనేని సాంబశివరావు చేసిన ప్రకటనలు రాజకీయ విమర్శకుల చేత అసహ్యించుకోబడింది

కమ్యూనిస్టులు తెలంగాణలో అధికారంలో లేరు,కనీసం గుర్తించబడిన ప్రతిపక్షం కూడా కాదు.తెలంగాణాలోనే కాదు దేశమంతా కమ్యూనిస్టులది ఇదే రీతి,ఇదే నీతి.




- "తెలంగాణలో మేము అధికారం సాధిస్తాము అనడం కరెక్ట్..అలా కాకుండా బిజెపిని అధికారంలోకి రానివ్వం" అంటూ తెలంగాణ కమ్యూనిస్టులు మాట్లాడడం వింతల్లోకెల్లా వింత

ఈ స్టేట్మెంట్ తో కమ్యూనిస్టుల రాజకీయ కార్యాచరణ ఎంత పేలవంగా ఉందో అర్థం అవుతుంది.

- మతోన్మాద ముస్లిం పార్టీలతో పొత్తులు పెట్టుకుని మనుగడ సాగించే కమ్యూనిస్టులు, బిజెపి, ఆర్ఎస్ఎస్ ను మతోన్మాద పార్టీలు అనడం విడ్డూరం..రాజకీయ దివాళాకోరు తనం

ఇంకో పక్క జూవీ నాయకులు కూడా బిజెపి ని అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాం అని దేశవ్యాప్తంగా జబ్బలు చరుచుకుంటూ తిరుగుతారు.CPM నాయకుడు దివంగత ఏచూరి సీతారాం గారు బిజెపిని అధికారంలోకి రానివ్వం, అడ్డుకుంటాం అంటూ ఒకటే రాగము ప్రతి ఎన్నికల్లో పాడేవాడు.కమ్యూనిస్టుల ఈ రాజకీయ గందరగోళం,వారిని ప్రజలకు దూరం చేసింది. చివరికి ప్రజల్లో తమ ప్రభావాన్ని,ప్రాభవాన్ని కోల్పోయింది.సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారం సాధిస్తామని చెప్పలేని హింసకు పాల్పడిన మావోయిస్టు నక్సలైట్లు కూడా చివరికి చేతులెత్తేశారు.మొత్తంగా కమ్యూనిస్టులు అంతా ఒకే రాగం పాడుతూ బిజెపి ని అడ్డుకుంటాం అంటూ నినాదాలిస్తారు.అసలు ఈ కమ్యూనిస్టులు బిజెపి కి ఒక రకంగా ప్రచారం కల్పిస్తున్నారు..

- కమ్యూనిస్టులు ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారో తెలియని స్థితి కి జారుకున్నారు

- కమ్యూనిస్టులోని అన్ని వర్గాలు సరైన దారి తెన్నూ లేక ఉత్సవ విగ్రహాలుగా maari

చివరి కోట కూలింది

- ఎర్రజెండా నెమ్మదిగా కిందకు దిగుతుండగా, మరోవైపు నుంచి కమల దళం కాషాయ జెండా దూసుకుపోతూ ఎగురుతున్నది.

ఆర్ఎస్ఎస్, బిజెపిపై కమ్యూనిస్టుల గుడ్డి వ్యతిరేకత వారిని ప్రజలకు దూరం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్మాదంతో పని చేసే మతాలతో, మతోన్మాదులతో అంట కాగుతున్న కమ్యూనిస్టుల పట్ల హిందువులకు కోపము పెరిగిపోయింది.మెజారిటీ హిందువులకు కమ్యూనిజం దూరమైంది కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఖణఖీ 140 సీట్లలో 100 పైగా స్థానాల్లో ఆధిక్యం సాధించింది.దశాబ్దాల కమ్యూనిస్ట్ పాలనకు ముగింపు పలికింది.భారత రాజకీయ పటంలో ఎరుపు రంగు మాయం భారతదేశ చిత్రపటంపై పశ్చిమ బెంగాల్, త్రిపుర తో పాటు ఇప్పుడు కేరళలో కూడా ఎరుపు రంగు వెలిసిపోయింది.

- 1977 తర్వాత మొదటిసారిగా భారతదేశంలోని ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్ట్ ప్రభుత్వం లేని పరిస్థితి ఏర్పడింది.

పశ్చిమ బెంగాల్‌లో బిజెపి భారీగా పుంజుకుని 200 పైచిలుకు సీట్ల వరకు ఆధిక్యంలో ఉండగా, అక్కడ కమ్యూనిస్టులు నామమాత్రపు స్థానాలకే పరిమితమయ్యారు మతోన్మాద బిజెపి అంటూ పడికట్టు పదాల గారడీలో పడి చివరకు కమ్యూనిస్టులు "వర్గ ఉన్మాద" ముద్రతో కనుమరుగయ్యారు.ముఖ్యమైన రాజకీయ పరిణామాలు కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఖణఖీ 102 సీట్ల భారీ విజయం దిశగా దూసుకుపోతే. సీపీఎం నేతృత్వంలోని ాణఖీ కేవలం 35 పరిమితమైంది

- పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ 208 సీట్ల సాధనతో, చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి రాబోతోంది. ఇక్కడ కమ్యూనిస్టులు కేవలం 3 స్థానాలకే పరిమితమయ్యారు
- అస్సాంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే 102 పైగా సీట్లతో వరుసగా మూడోసారి విజయం సాధించింది
- తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని ాఎఖ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా చరిత్ర సృష్టించింది. సీపీఎం అక్కడ డీఎంకేతో పొత్తులో భాగంగా కేవలం కొన్ని 2 సీట్లకే పరిమితమైంది.
- కేంద్ర పాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ మరోసారి స్పష్టమైన మెజారిటీ సాధించి అధికారంలోకి రాబోతుంది. అక్కడ కమ్యూనిస్టు ఉనికి లేదు

- భారతదేశ రాజకీయ చరిత్రలో ఒకప్పుడు నిర్ణయాత్మక శక్తిగా వెలుగొందిన కమ్యూనిస్టులు, ప్రస్తుతం తమ ప్రాభవాన్ని కోల్పోయి సంక్షోభంలో కూరుకుపోయారు

స్వాతంత్ర్యానంతర తొలి ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీలు (CPI, CPI-M) చివరికి కేరళలో కూడా కనుమరుగయ్యారు.

- సిద్ధాంతపరమైన మొండితనం

- కమ్యూనిస్టుల సంప్రదాయ రాజకీయ వైఖరిలో మొండితనంతో ప్రజలకు దూరమైంది. గతిశీలత సూత్రాన్ని ప్రచారం చేసే కమ్యూనిస్టులు గతి తప్పి మతి తప్పి దేశంలో ప్రజలచే తిరస్కరించబడ్డారు

మారుతున్న కాలానికి మరియు ప్రపంచ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్టులు తమ వ్యూహాలను మార్చుకోలేకపోయారు.సోవియట్ యూనియన్ పతనం తర్వాత కూడా పాత సిద్ధాంతాలకే కట్టుబడి ఉండటం, సరళీకృత ఆర్థిక విధానాలను (Liberalization) తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల అభివృద్ధిని ఆకాంక్షించే యువతకు వీరు దూరమయ్యారు. కులం కంటే ప్రమాదకరమైన "వర్గ విభజన" సిద్ధాంతంతో కమ్యూనిస్టులు భారతదేశంలో ఒక కొత్త వ్యవస్థ నిర్మాణం చేయబోయి విఫలమయ్యారు భారతీయ సామాజిక నిర్మాణంలోని విశిష్టతను అర్థం చేసుకోలేక.."వర్గ పోరాటం" (Class Struggle) పైనే దృష్టి పెట్టి, కుల వివక్షను మరియు దళితుల సమస్యలను సిద్ధాంతపరంగా సరిగ్గా విశ్లేషించలేకపోయారు.

- ఆర్థిక సమానత్వానికే ప్రాధాన్యత అంటూ సామాజిక రుగ్మతలను సంస్కరించలేక అణగారిన వర్గాల మద్దతును పూర్తిగా పొందలేకపోయారు

అంతర్గత చీలికలు మరియు విభేదాలు
1964లో చైనా-భారత్ యుద్ధం నేపథ్యం మరియు సిద్ధాంతపరమైన విభేదాల వల్ల భారత కమ్యూనిస్ట్ పార్టీ రెండుగా (CPI మరియు CPI-M) చీలిపోయింది. ఆ తర్వాత కూడా అనేక చిన్న గ్రూపులుగా విడిపోవడం వల్ల కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడింది. ఐక్యత లేకపోవడం వల్ల ఇతర జాతీయ పార్టీలను సమర్థవంతంగా ఎదుర్కోలేకపోయారు.ప్రాంతీయ దుర్గాల పతనం పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాలను కమ్యూనిస్టుల ప్రాంతీయ దుర్గాలు అని రాజకీయ పండితులు అంటారు.పశ్చిమ బెంగాల్ లో 34 ఏళ్ల నిరంతర పాలనలో ఏర్పడిన అధికార గర్వం, "క్యాడర్ రాజ్" (పార్టీ కార్యకర్తల పెత్తనం) కార్యక్రమాలతో.. నందిగ్రామ్, సింగూర్ వంటి భూసేకరణ వివాదాలు బెంగాల్‌లో కమ్యూనిస్టుల పతనానికి దారితీశాయి.కమ్యూనిస్టుల హింస రాజకీయ కార్యాచరణను కాపీ కొట్టిన తృణమూల్ కాంగ్రెస్ కూడా కమ్యూనిస్టుల కంటే ఎక్కువ హింసను ప్రయోగించి 15 ఏళ్లు బెంగాల్ ను పాలించింది.

- కమ్యూనిస్టుల పారిశ్రామికీకరణలో వైఫల్యం మరియు నిరుద్యోగం వల్ల ప్రజలు మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వైపు ప్రజలు మొగ్గు చూపారు

కమ్యూనిస్టుల హింస రాజకీయాలతో విసిగిపోయిన బెంగాల్ ప్రజలు తృణ మూల్ కాంగ్రెస్ ను ప్రత్యామ్నాయంగా భావించి మోసపోయారు. దానివల్లనే టీఎంసీ పట్ల కూడా ప్రజలకు విముఖత కలిగింది.జాతీయవాదం పట్ల కమ్యూనిస్టుల చిన్నచూపు చైనా లేదా ఇతర దేశాల విధానాలను సమర్థించడం వల్ల కమ్యూనిస్టులపై "భారతీయత లేనివారు" అనే ముద్ర పడింది.
ప్రస్తుత భారత రాజకీయాల్లో బలంగా ఉన్న హిందూత్వ జాతీయవాదం మరియు ప్రాంతీయ గుర్తింపు రాజకీయాలను (Identity Politics) ఎదుర్కోవడంలో వీరు విఫలమయ్యారు.
నశించిన నాయకత్వం ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం కేరళలో ఈఎంఎస్ నంబూద్రి పాద్ నేతృత్వంలో ఏర్పడింది.అటువంటి కమ్యూనిస్టు దుర్గం కేరళ ఇప్పుడు కమ్యూనిస్టులు చేయి జారిపోయింది.జ్యోతి బసు, హరికిషన్ సింగ్ సూర్జిత్ వంటి హేమాహేమీల తర్వాత ఆ స్థాయి ప్రజాకర్షణ గల నాయకులు కమ్యూనిస్టు పార్టీల్లో కరువయ్యారు. పార్టీ విధానాలు కేవలం మేధోపరమైన చర్చలకే పరిమితమై, సామాన్య ప్రజల దైనందిన సమస్యలకు దూరమయ్యాయనే విమర్శ ఉంది.ముగింపుకమ్యూనిస్టులు తిరిగి పుంజుకోవాలంటే కేవలం పాత విజయాలను స్మరించుకోవడం కాకుండా, భారతీయ సామాజిక వాస్తవాలకు, జాతీయ భావాలకు అనుగుణంగా తమ సిద్ధాంతాలను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో వారు భారత రాజకీయాల్లో మరింత అప్రస్తుతంగా irrelevant గా మారే ప్రమాదం ఉంది.లెఫ్ట్ ఇస్ లెఫ్ట్.. అంటూ భారత ప్రజలు కమ్యూనిస్టులను భారత రాజకీయాలనుంచి పక్కకు తప్పించారు.రైట్ ఇస్ రైట్.. అంటూ జాతీయవాద రాజకీయాలను ప్రజలు "రైట్" అంటూ అధికారం అప్పగిస్తున్నారు.కమ్యూనిస్టులకే కాదు ఈ పరిస్థితులు సెక్యులర్ పార్టీలకు కూడా ఎదురవుతున్నది. భాష పేరుతో ప్రాంతం పేరుతో కుటుంబ పాలనను ప్రజలపై రుద్దిన ప్రాంతీయ పార్టీలు క్రమక్రమంగా తమ పట్టును కోల్పోతున్నారు

- హిందూ వ్యతిరేకతను సెక్యులరిజం అంటూ పిలుచుకునే కాంగ్రెస్ తదితర ప్రాంతీయ సెక్యులర్ పార్టీలు కూడా భవిష్యత్తులో కనుమరుగ కావడం ఖాయం

••Left is left
వామపక్షం పక్కకెళ్లింది

••Right is right
**దక్షిణ పక్షం ముందుకెళ్లింది**

**అని రాజకీయ విశ్లేషకులు అంటున్న మాట నిజం అవుతున్నది.**

## షన్ముఖ అగ్రిటేక్ ఆధ్వర్యంలో అధిక దిగుబడికి రైతులకు అవగాహన సదస్సు

-మెరుగైన దిగుబడి కోసం శాస్త్రీయ నేల పరీక్షలు
-విత్తనం నుండి పంట కోతవరకు సంపూర్ణ పరిష్కారం
-ప్రభుత్వ పథకాలు పొందుటకు మార్గదర్శకం చూపిస్తాం







కరపత్రం ప్రతినిది అందోలు

సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల కేంద్రంలో సోమవారం. శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీ వారి, షన్ముఖ అగ్రిటేక్ ఆధ్వర్యంలో. పంట అధిక దిగుబడి ఎలా పొందాలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా. కంపెనీ జనరల్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ బిక్షమయ్య, మార్కెట్ డెవెలప్మెంట్ హెడ్ శశిధర్, లు మాట్లాడుతూ.. రైతులకు పలు సూచనలు చేశారు. పరిమితికి మించి మందులు వాడటం వల్ల భూమి లో సారవంతం తగ్గి,అధిక దిగుబడి రాదన్నారు. మా కంపేని సూచనల ప్రకారం సేద్యం చేయడం వల్ల రైతులకు ఖర్చులు తగ్గుతాయని సూచించారు. మాపై భరోసా వుంచి ఒక ఎకరం భూమిలో మా కంపేని సూచనల ప్రకారం వ్యవసాయం చేసే అవకాశం మాకు ఇవ్వండి అధిక పంట దిగుబడి చేసి చూపిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. మీ గ్రామానికే వచ్చి పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా శాస్త్రీయ పరిశోధనలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉచిత పతకాల వివరాలు అందరికీ అవగాహన ఉండదు కాబట్టి మా కంపేని హక్ అనే సంస్థతో కలిసి ఉచిత పథకాలకు అర్హులైన రైతులకు అందేలా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీ వారి షణ్ముఖ అగ్రిటేక్ కంపెనీ ప్రతినిధులు, వట్టిపల్లి పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు



## పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

కరపత్రం ప్రతినిది వేములవాడ

పేదల సొంతింటి కల సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్,వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత- శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్ తదితరులున్నారు.

## రైతుల వారోత్సవాలు ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ప్రజెంట్ మే 4**





రైతు వారోత్సవాలు ప్రజా పాలన -ప్రగతి నివేదిక లో భాగంగా రైతు వారోత్సవాలన లో భాగంగా సోమవారం నాడు మెదక్ జిల్లా మాసాయిపేట మండలకేంద్రంలోనిరైతు వేదికలో ప్రారంభించడం జరిగిందని ఈ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు మాసాయిపేట మండలం వ్యవసాయ అధికారిని కవిత తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరైతులు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులు , పచ్చి రొట్ట ఎరువులు వాడాలని, పప్పు దినుసుల పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. వర్షాకాలం లో వరి సన్న రకాలు సాగు చేసి బోనస్ పొందాలనీ సూచించనైనదని.ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని తెలియజేయడంజరిగిందనిఈ కార్యక్రమంలో రైతులకి భూసార పరీక్ష ఫలితాల కార్డులను అందజేయడం జరిగిందనిఈ కార్యక్రమంలో ఆవులు రాజిరెడ్డి , వివిధ గ్రామాల సర్పంచులు, ఏఈవో రజిత ,రైతులు మాసాయిపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ నాగిరెడ్డి గ్రామ్ గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి మాజీ ఎంపీటీసీ చెరుకు సిద్ధ రాములు గౌడ్ మాసాయిపేట మాజీ ఉపసర్పంచ్ నాగరాజు రామంతాపూర్ తాండ మాజీ సర్పంచ్ పకీర గోపి తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా -- శోభాయాత్రకు ఏసీపీ మాధవికి ఆహ్వానం,



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 4**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా మే 5, 2026 (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు హుజురాబాద్ ఏసీపీ మాధవిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు ఏసీపీ మాధవిని మర్యాదపూర్వకంగా కలిసి శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా శోభాయాత్రను మరింత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర సాగనుంది. శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశముండడంతో భద్రతా చర్యలు కూడా కట్టుదిట్టంగా చేపట్టాలని నిర్వాహకులు భావిస్తున్నారు. యువత, భక్తులు, మహిళలు, పిల్లలు భారీగా పాల్గొని హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి రాజకుమార్, బచ్చు శివకుమార్, పొనగంటి రవీందర్ (పీజేఆర్), సంపెల్లి సంపత్ రావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతి శోభాయాత్రను విజయవంతం చేయాలని హనుమాన్ దీక్ష స్వాములకు భక్తులకు పట్టణ ప్రజలకు నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## మైనార్టీ బాలుర గురుకుల కళాశాలల ఇంటర్మీడేట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కరపత్రం ప్రతినిధి అందోలు**




సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని జోగిపేట పట్టనంలో గల మైనార్టీ బాలుర కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి గాను (2026-2027) సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సి.ఇ.సి, ఎం. ఇ .సి, వొకేషనల్ (ఎం ఎల్ టి) గ్రూపులకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ పీ. జీవందర్ తెలిపారు. మైనార్టీ (ముస్లిం, క్రైస్తవ, సిక్కుల, జైన్, పార్శీ మరియు బౌద్ధులు) ల కొరకు 75% సీట్లు, నాన్ మైనార్టీలు ఎస్సి, ఎస్టి బిసిల కొరకు 25% సీట్లు రిజర్వ్ చేయబడినవని తెలిపారు. ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా (www.tgmries.telangana.gov.in) లేదా TGMREIS మొబైల్ యాప్ ద్వారా గానీ నేరుగా జోగిపేటలో గల మైనార్టీ గురుకుల కళాశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం క్రింది నంబర్లను సంప్రదించగలరు: 8106101383 / 7207998952 / 9059667457/

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 54 మంది లబ్దిదారులకు రూ. 26.41 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్దిదారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 835 మంది లబ్దిదారులకు రూ. 5.93 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు మంత్రి వెల్లడించారు.

## అయ్యా కరెంటు సార్లు నా బాధ వినిపించుకోరా..???

- అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం
- బాధ్యుడు బ్యాగరి శేఖర్
- ఇందిరమ్మ ఇల్లు మంజూరై ఏడాది గడుస్తున్నా నిర్మించుకోలేని పరిస్థితి
- తన సొంత స్థలం పై నుండి 11 కేవీ విద్యుత్ తీగలు ఉండడంతో ఇంటిని నిర్మించుకో లేక పోతున్నాననిబాధితుడు ఆవేదన

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 4**



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామ నివాసి అయినా బ్యాగరి శేఖర్ కు ఏడాది క్రితం ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా తన సొంత స్థలంలో 11 కెవి స్తంభం ద్వారా విద్యుత్ తీగలు వెళ్లడంతో ఇల్లు నిర్మాణానికి ఆటంకం కలుగుతుంది అని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవడం లేదని బ్యాగరిశేఖర్ తన ఆవేదనను జాతీయ భూమి ప్రతినిధికి తన ఆవేదన తెలిపి అనంతరం ఆయన మాట్లాడుతూ తన తండ్రి కష్టార్జితంతో నిత్యం కూలి పనులు చేసుకుంటూ పూరి గుడిసె తన సొంత స్థలంలో నిర్మించుకున్నారు ఎన్నో ప్రభుత్వాలు మారిన తమ తలరాత మారలేదని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా తమకు ఇల్లు మంజూరు కావడంతో తన సొంత స్థలంలో ఇంటిని నిర్మాణం కోసం పనులను ప్రారంభించగా తన సొంత స్థలంలో 11 కెవి స్తంభం విద్యుత్ తీగలు వెళ్లడంతో తన ఇంటి నిర్మాణానికి ఆటంకంగా ఉన్నాయని విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని నిరుపేదనని ఏ అధికారి దగ్గరికి వెళ్లాలో ఏమీ తెలియని అయోమయమైన పరిస్థితి తనదని ఆయనకు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఇల్లు మంజూరై ఏడాది గడుస్తున్నా ఆదిలోనే నిర్మాణ పనులు ఆగిపోవడంతో ఎంతో ఆవేదన చెందుతూ అయ్యా కరెంటు సార్లు నా నీరు పేద కటికులపై కనికరం చూపి నేను నిర్మిస్తున్నటువంటి స్థలానికి వచ్చి పరిశీలించి తమకు న్యాయం చేయాలని పత్రికాముఖంగా తెలియజేస్తున్నానని బ్యాగరి శేఖర్ తెలియజేశారు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ

- రైతు వేదిక పరిధి గ్రామాల లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాలలో పాల్గొన్న పలు గ్రామాల సర్పంచులు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 4**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా తొలి రోజు వ్యవసాయ శాఖకు సంబంధించిన రోజుగా పరిగణిస్తూ సోమవారం నాడు రైతు వేదిక స్థాయిలో మెదక్ జిల్లావెల్దుర్తి మండలం లో బండపోసంపల్లి, మంగళ్పర్తి ,హస్తల్ పూర్ కుక్కునూరు వెల్దుర్తి రైతు వేదికలలో రైతులకు నేల ఆరోగ్యము భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఝాన్సీ మాట్లాడుతూ రైతులకి భూసార పరీక్షలు ఎలా చేసుకోవాలి నెలల ఆరోగ్యం వాటి ప్రాముఖ్యత భూసార పరీక్షల్లో తెలిపిన వివరాల ఆధారంగా తగిన మోతాదులో ఎరువుల యాజమాన్యం సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడి పద్ధతులను ఎలా పాటించాలో తెలియజేస్తూ సేంద్రియ పద్ధతిలో జీవన ఎరువులను ఉపయోగించి విత్తన శుద్ధి ప్రక్రియను పద్ధతినీ ప్రత్యక్ష ప్రదర్శన చేసి చూపించడం జరిగిందని ఈ కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను పంపిణీ చేశామని రైతుల అనుభవాలను తోటి రైతులతో పంచుకునేలాగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందనిరైతులకు ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది రకాల సన్న వరి రకాలను సాగు చేయవలసిందిగా సూచనలు చేయడం జరిగిందని వారు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో ఆరెగూడెం సర్పంచ్ చైతన్య హనుమంత రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ దుర్గా ఎల్కపల్లి సర్పంచ్ పావనిశివలింగం , మంగళ్పర్తి సర్పంచ్ సంధ్య రామకృష్ణ రావు రామయపల్లి సర్పంచ్ పావని మహేందర్ సర్పంచులు వారికి సంబంధించిన రైతు వేదికలలో పాల్గొనడం జరిగిందని తెలియజేశారు వెల్దుర్తి రైతు వేదికల జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మజీద్ అలీ, ఉత్తమ్ కుమార్, సాయికుమార్, సింధు మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్ ఎఫ్ బి ఓ డైరెక్టర్లు మెంబర్లు మండల రైతులు పాల్గొని కార్యక్రమాన్ని అందరికి సహాయ సహకారాలు మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేశామని వ్యవసాయ శాఖ అధికారిని ఝాన్సీ తెలియజేశారు

## దేశం తీర్పు స్పష్టం -- ఎన్డీఏ ఘన విజయం, తెలంగాణలో కమలం వికాసం ఖాయం: మట్ట పవన్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట మే 4**



వెల్లడైన ఎన్నికల ఫలితాలపై బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి స్పందిస్తూ, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి సాధించిన విజయాన్ని దేశవ్యాప్తంగా ప్రజల విశ్వాసానికి ప్రతీకగా పేర్కొన్నారు. అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతే ఈ ఫలితాల్లో ప్రతిఫలించిందని ఆయన అన్నారు.

ప్రత్యేకంగా పశ్చిమ బెంగాల్‌లో వచ్చిన ఫలితాలు ప్రజల్లో మార్పు పట్ల ఉన్న ఆకాంక్షను స్పష్టంగా చూపిస్తున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలు స్థిరమైన నాయకత్వం, అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇదే ధోరణి రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా కనిపిస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని మట్ట పవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీ విధానాలు కేంద్ర నాయకత్వంపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు.

ప్రధాని నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అదే అభివృద్ధి నమూనాను తెలంగాణలో కూడా అమలు చేయడం బీజేపీ లక్ష్యమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తప్పదని, ఇది ప్రజల సంకల్పమేనని స్పష్టం చేశారు. దేశంలో మార్పు ప్రారంభమైందని, తెలంగాణలో కూడా కమలం వికసించడాన్ని ఎవరూ ఆపలేరని, ఇది భవిష్యత్ దిశ అని మట్ట పవన్ రెడ్డి పేర్కొన్నారు.

## హన్మాజిపేటలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురు అరెస్ట్
- రూరల్ ఎస్సై చల్లా వెంకట్రాజం

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ చల్లా వెంకట్రాజం తెలిపారు. సోమవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హన్మాజిపేట గ్రామ పరిసర ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారని, ఈ సందర్భంగా రామ్‌రెడ్డి, దేవయ్య, సతీష్, భూమయ్య, రణదీర్‌రెడ్డి అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుండి పేకముక్కలు, రూ. 7,750 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. అనంతరం ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో పేకాట స్థావరాలు, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## వేములవాడలో పెట్రోల్ కొరత.. వాహనదారుల ఆవేదన

**కరపత్రం ప్రతినిధి, వేములవాడ**




వేములవాడ మున్సిపల్ పరిధిలోని నంది కమాన్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ స్టాక్ లేకపోవడంతో స్థానిక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ “నో స్టాక్” బోర్డు దర్శనమివ్వడంతో ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. రోజువారీ పనుల కోసం బయలుదేరే ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు పెట్రోల్ కోసం సమీప ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరి వాహనాలు మార్గమధ్యంలోనే ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ కొరత ప్రభావం విద్యార్థులు, ఉద్యోగులపై కూడా పడుతోంది. సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నామని వారు చెబుతున్నారు. పెట్రోల్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో అదనపు సమయం, ఖర్చు భారం పెరుగుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సమస్యపై స్పందించిన పలువురు వాహనదారులు సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటనే స్పందించి పెట్రోల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. పెట్రోల్ కొరత సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.